www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 4 జనవరి 2025

5

వైఎస్ఆర్

పక్కాగా ఇసుక పంపిణీ విధానం : కలెక్టర్

ప్రజాశక్తి-కడప : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇసుక పంపిణీ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూతన ఇసుక పాలసీ, బుకింగ్, సరఫరా, లభ్యత , పట్టా లాండ్స్ ,సెమీ మెకానిస్ట్ ఇసుక రీచ్‌లు వంటి అంశాలపై అమరావతి నుంచి గనులు భూగర్భ శాఖ కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్న కలెక్టర్ విసి అనంతరం మాట్లాడారు. ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లకు అనుమతులకు సంబంధించి ఎలాంటి అంశాలు పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి కాలేజీ బువ్వ

- 20 కళాశాలల్లో అమలుకు శ్రీకారం
- 4,969 మంది విద్యార్థులకు ప్రయోజనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం నుండి మధ్యాహ్నం భోజనం అందించనున్నారు. ఈ పథకాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజయవాడలో ప్రారంభించనున్నారు. ఇంటర్ విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం ప్రభుత్వం అధికారికంగా ఇంటర్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన జిఒను విడుదల చేసింది. పేదరికం కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు ఆరోగ్యం అన్ని విధాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఈ మధ్యాహ్న భోజనం పథకాన్ని తీసుకున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఇంటర్ జూనియర్ కళాశాలలో ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనున్నారు. తమకు మధ్యాహ్న భోజన పథకం ఎప్పుడు అమలు చేస్తుందో అని ఎదురుచూస్తున్న ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది.

భోజన ఏర్పాట్లు ఇలా...

జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. వీటిలో ఉన్న మొత్తం 4,969 మంది విద్యార్థులకు పథకం ద్వారా ప్రయోజనం కలగనుంది. వీరిలో 3,100 మంది ప్రథమ, 3,123 ద్వితీయ విద్యార్థులు ఉన్నారు. జిల్లాలో పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే మధ్యాహ్న భోజనం అమలవుతోంది. జిల్లాలో ఉన్న 1,20,021 మందికి విద్యాశాఖ అధికారులు భోజనం అందిస్తున్నారు. డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలను మధ్యాహ్న భోజన కార్మికులుగా నియమించి వారితో ఆహార పదార్థాలను తయారు చేయిస్తున్నారు. ఇప్పుడు వీరితో పాటు అదనంగా ఆహార పదార్థాలను తయారు చేయించి, కళాశాలకు సరఫరా చేయనున్నారు. జిల్లాలో 20 కళాశాలలకు సమీపంలో ఉన్న పాఠశాలల ద్వారా అందించనున్నారు.

ఇంటర్ విద్యార్థులకూ అదే మెనూ..

పాఠశాలల్లో వండిన ఆహార పదార్థాలనే కళాశాలలకు అందిస్తుండడంతో అదే మెనూ వారికీ ప్రస్తుతానికి అమలు చేయాలని కూటమి

ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వారానికి ఐదుసార్లు గుడ్డు, సోమ, బుధ, శుక్రవారాల్లో చిక్కి, మంగళ, గురు, శనివారాల్లో రాగి జావ అందించనున్నారు.

రోజువారీ మెనూ జాబితా...

సోమవారం : వేడి పొంగలి, ఉడికించిన గుడ్డు లేదా వెజిటబుల్ పలావు, కోడి గుడ్డు కూర, వేరుశనగ చిక్కీ **మంగళవారం :** పులిహోరా, దొండకాయ చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ, **బుధవారం :** వెజిటబుల్ రైస్, బంగాళాదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ, **గురువారం :** సాంబారు అన్నం లేదా లెమన్ రైస్, టమాట చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ, **శుక్రవారం:** అన్నం, ఆకుకూర, పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ, **శనివారం :** ఆకుకూరలతో భోజనం, పప్పుచారు, స్వీట్ పొంగలి, రాగి జావను వడ్డిస్తారు.

గ్రామీణ విద్యార్థులకు ఎంతో మేలు

గ్రామీణ ప్రాంతం నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమై కళాశాలకు చేరుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఎంతో మేలు చేస్తుంది. చాలామంది విద్యార్థులు ఇంటి వద్ద టిఫన్ చేయకుండానే కళాశాలకు వచ్చే వారు ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి వారికి ఈ పథకం ఎంతో మేలు చేస్తుంది. ఇస్కాన్ వారు సరఫరా చేయడం వల్ల క్వాలిటీ ఉండే అవకాశం ఎక్కువ. మధ్యాహ్నం కళాశాలలో తినడం వల్ల సమయము హాదా అవుతుంది.

- సూర్యారావు, ప్రిన్సిపల్, బాలికల జూనియర్ కళాశాల, కడప.

అన్ని ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో ఉన్న 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల నాలుగో తేదీ నుంచి ప్రారంభమయ్యే మధ్యాహ్న భోజన పథకం అమలుకు అన్ని ఏర్పాటు పూర్తి చేశాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 4,969 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జూనియర్ కళాశాలకు సమీపంలో ఉన్న పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులు జూనియర్ కళాశాలకు కూడా భోజనం పంపుతారు. ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులు వీటిని ప్రారంభిస్తారు. పథకం అమలు తీరును కలెక్టర్ కు వివరించాం.

- వెంకటసుబ్బయ్య, ఆర్ఐఒ, కడప.

వినతులు స్వీకరించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి - కడప

వివిధ కుల సంఘాల నాయకుల నుండి ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అభిప్రాయాలను, వినతులను స్వీకరించారు. షెడ్యూలు కులాల వర్గీకరణపై అభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం కడప జిల్లాకు రాజీవ్ రంజన్ మిశ్రా వచ్చారు. కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో పాల్గొన్నారు. విద్యా, ఉద్యోగాల పరంగా, వివిధ రకాల ప్రభుత్వ పథకాల పరంగా లబ్ధిపొందుతున్న షెడ్యూల్ కులాల లబ్ధిదారుల వివరాలను తెలుసుకుని ఆయా శాఖల అధికారులతో రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడారు. అనంతరం వివిధ కుల సంఘాల నాయకులు నుండి అభిప్రాయాలను, వినతులను స్వీకరించారు. చైర్మన్‌తోపాటు అభిప్రాయాలు, వినతులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, జెసి అదితిసింగ్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి స్వీకరించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిప్రాయ సేకరణ, వినతులు స్వీకరణ కొనసాగింది.

మా పిల్లల భవిష్యత్తును కాపాడండి

'మా పిల్లల విద్యార్థుల భవిష్యత్తును కాపాడండి సార్' అంటూ బేడగం బేడ బుడగజంగం సంక్షేమ సంఘం నాయకులు రాజీవ్ రంజన్ మిశ్రాను శుక్రవారం కలిసి వినతి పత్రం సమర్పించి వేడుకున్నారు. కడప నగరం బుడగజంగం కాలనీకి చెందిన బేడ బుడగజంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దూపం రాజు, డి.శ్రీరాములు, సి.రామయ్య కాలనీ ప్రజలు,

మిశ్రాకు వినతి పత్రం అందజేస్తున్న బేడ బుడగ జంగం నాయకులు

విద్యార్థులు రాష్ట్ర నాయకులు టి.నారాయణ, టి.కొండయ్య తో కలిసి కొనేళ్లుగా తమ కులస్తులను ప్రభుత్వాలు గుర్తించలేకపోవడం వల్ల, వారు విద్య పైపు అభివృద్ధి చెందక, భిక్షాటన పైపు మగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు మనస్థాపనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. మా పిల్లల భవిష్యత్తును కాపాడి త్వరగా తమ కుల సర్టిఫికెట్లు ఇప్పించి మాకు న్యాయం చేయండి అని ఆయనను వేడుకున్నారు. కార్యక్రమంలో చిన్న గంగులు, మధారు, సి.పెద్దన్న, గోవిందు పాల్గొన్నారు.

క్రీడలు ఆడుతున్న అంధులు

అంధులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని పురస్కరించుకుని అంధుల పాఠశాలలో శుక్రవారం క్రీడా పోటీలు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్, విక లాంగుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలను డిప్యూటీ డిఇఒ రాజగోపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పిఇటిలు గణేష్ బాబు, వెంకటసుబ్బయ్య, విశ్వనాథ్, విజయలక్ష్మి పర్యవేక్షణలో క్రికెట్, షాట్ పుట్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ ఆర్.వి. కృష్ణ కిషోర్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది 3,4 తేదీలలో అంధులకు క్రీడా పోటీలు, సభ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుం దన్నారు. వీరిలో ప్రతిభను గుర్తించేందుకు పోటీలు దోహదపడతాయని తెలి పారు. పోటీలలో గెలుపొం దిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానియేల్ ఎబరై జర్, ఉపాధ్యాయులు, వికలాంగుల సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రభుత్వాసుపత్రి వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు, చాపాడు మండలం నక్కలదిన్నె గ్రామానికి చెందిన శివలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ట్యూబెక్టమీ ఆపరేషన్ కోసం గత అక్టోబర్ 29న జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేరగా డాక్టర్ ఇలియారాణీ ఆపరేషన్ చేసి రెండు గంటల తర్వాత డిశ్చార్జ్ చేశారన్నారు. అదేరోజు సాయంత్రం నుంచి వాంతులు, బేదులు కావడంతో అదే నెల 30న తిరిగి ఆసుపత్రికి వచ్చి ఆ వైద్యురాలిని కలిశామన్నారు. ఆమె సమస్య ఏమీ లేదు, గ్యాస్ ట్రబుల్ అని మందులు ఇచ్చి ఇంటికి పంపారని, సమస్య తగ్గకపోగా పెరగడంతో నవంబర్ 2న తిరిగి ఆసుపత్రికి వచ్చి డాక్టర్ సూచనల మేరకు స్కానింగ్ చేయించామని, గ్యాస్ సమస్యే అని తిరిగి జనరల్ సర్జన్‌ను కలవాలని చెప్పడంతో జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని సర్జన్‌ను కలిస్తే ఆయన కూడా గ్యాస్ ట్రబుల్ అని చెప్పారు. ఇబ్బందిగా ఉంటేహాస్పిటల్ లో చేరాలని సూచిస్తే చేరామన్నారు. తగ్గకపోవడంతో ప్రవేట్ ఆసుపత్రిలో మరోమారు స్కానింగ్ చేయించడంతో ప్రేగుకు రంధ్రం పడిందని తెలిసిందన్నారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడ 40 రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందామని వివరించారు. ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే సమస్య వచ్చిందని చెప్పారు. వైద్యురాలిపై ప్రభుత్వం చర్యలు తీసుకోని పక్షంలో ఆమరణ దీక్ష చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బాధితురాలి భర్త విశ్వనాథ రెడ్డి, బాధితురాలి తండ్రి సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

అప్పులబాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దముడియం

మహేశ్వర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకొని ఓ యువ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం పెద్దముడియం మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి.. కొండసుంకేసుల గ్రామానికి చెందిన మేడగం మహేశ్వర్ రెడ్డి(46)కు ఏడు ఎకరాల పొలం ఉంది. మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు ఆయా రకాల పంటలు సాగు చేశాడు. ఈ క్రమంలో పంట దిగుబడి సరిగా రాకపోవడంతో నష్టాలు పాలయ్యాడు. సుమారు రూ. 10 లక్షల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో తిరిగి అప్పులు చెల్లించే దారి లేకపోవడంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. వారిలో ఇద్దరు కుమార్తెలున్నారు. వారందరూ చదువుకుంటున్నారు. ముగ్గురు పిల్లలు ఇంకా చదువు కుంటూనే ఉన్నారని, ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకుండానే వెళ్లిపోయాడని, పీకల్లోతు అప్పుల్లో ఉన్న కుటుండాన్ని ఎలా నెగ్గుకు రావాలో అర్థం కావడం లేదని మృతుని భార్య కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ అవార్డులు

ప్రజాశక్తి - కడప అర్బన్

అవార్డు అందజేస్తున్న వైస్ చైర్మన్

నగరంలోని అక్కాయ పల్లెలో ఉన్న సాయిబాబా విద్యాసంస్థల విద్యార్థులకు ఉత్తమ ప్రతిభ అవార్డులను వైస్ చైర్మన్ ఎం.వి. సాయి సుధీర్ కుమార్ రెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు మెడల్స్ సర్టిఫికెట్ అందజేశామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడిక కలిగి జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు, పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 4,7 ఆధ్వర్యంలో కడప నగరంలోని సాయిబా అనాథ శరణాలయం పిల్లలకు, దుప్పట్లు, రైటింగ్ ప్యాడ్ లు, నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. శుక్రవారం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వీటిని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె. లలిత, డా.ఎస్.సునీత చేతుల మీదుగా వీటిని అందజేశారు.

నేటి నుంచి సిపిఎం జిల్లా మహాసభ

- కడప నగరం ముస్తాబు
- అరుణ తోరణాలు, ఫ్లెక్సీలతో అలంకరణ
- బహిరంగ సభకు హాజరుకానున్న ఎం.ఎ.గపూర్, కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సిపిఎం కడప జిల్లా 12వ మహాసభలు కడప నగరంలో శనివారం ప్రారంభంకానున్నాయి. ఈ నెల 4, 5వ తేదీల్లో నిర్వహించనున్న మహాసభలకు సిపిఎం పెద్దఎత్తున ఏర్పాట్లు చేపట్టింది. కడప నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లను ఎర్రజెండాలతో ముస్తాబు చేసింది. నగరంలోని ప్రధాన రహదారుల్లోని కూడళ్లను ఎర్రజెండాల తోరణాలతో అరుణమయం చేసింది. కడప నగరం బిల్డప్ సమీపంలోని అజ్మత్ ఫంక్షన్ హాలులోని కామ్రేడ్ సీతారాంఏచూరి ప్రాంగణంలో మహాసభ జరగనుంది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మందికిపైగా ప్రతినిధులు, పరిశీలకులు హాజరు కానున్నారు. కడప నగరంలోని జియోన్ కాలేజీ నుంచి ఉదయం 10 గంటల నుంచి భారీ ర్యాలీ, ప్రదర్శనలతో ఐటిఐ సర్కిల్‌లో నిర్వహించనున్న బహిరంగసభకు హాజరు

ముస్తాబైన సభా ప్రాంగణ వేదిక

కానున్నారు. మహాసభ ప్రారంభానికి ముందు ఐటిఐ సర్కిల్‌లో బహిరంగసభ జరగనుంది. బహిరంగ సభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. అనంతరం మధ్యాహ్నం బిల్డప్ సర్కిల్‌లోని కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణం (అజ్మత్‌ఫంక్షన్) హాలులో ఉదయం 11.30 గంటలకు 12వ మహాసభ ప్రారంభం కానుంది. 11వ మహాసభ నుంచి ఇప్పటివరకు మూడేళ్ల వ్యవధిలో జిల్లాలో చేపట్టిన ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించుకుని ముందుకు సాగనుంది. అనంతరం రాబోయే మూడేళ్ల భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోనుంది. మూడేళ్లలో జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ చేపట్టిన ర్యాలీలు, పాద యాత్రలు, బద్వేల్ రూరల్‌లో ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని కోరుతూ పోరాటాలు, జిల్లాలోని బి.మఠం, కలసపాడు, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లోని 14 కేంద్రాల్లో భూ ఆక్రమణలపై అలుపెరగని పోరాటాలు చేపట్టింది. ఉద్యోగ, కార్మిక వర్గాల సమస్యలపై అనేక పోరాటాలు చేసిన సంగతి తెలిసిందే. వీటన్నింటినీ సిపిఎం మహాసభల్లో సమీక్షించుకుని ముందుకు సాగనుంది. భవిష్యత్‌లో ప్రజాపునాదిని పెంపొందించుకోవడంపై దృష్టి సారించనుంది.

ఇంజినీరింగ్ కార్మికులకు

స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల స్కిల్డ్ సెమీస్ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న123 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలలో ఇంజినీరింగ్ విభాగాలైన మంచినీటి నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, టౌన్ ప్లానింగ్ నిర్వహణ, పిట్టర్స్, ఆర్టికల్చర్, మెకానిక్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీసు నిర్వహణ, బిల్ కలెక్టర్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్‌లు, విభాగాలకు చెందిన సుమారు13 వేల మంది కార్మికులు 20 నుంచి 25 ఏళ్లుగా ప్రజలకు, ప్రభుత్వానికి సేవలు అందిస్తున్నారని తెలిపారు. వీరికి 2018 సంవత్సరం వరకు పారిశుధ్య కార్మికులతో పాటు సమానంగా జీతాలు చెల్లించారని, ప్రస్తుతం తక్కువ వేతనాలు చెల్లించడం సరికాదని పేర్కొన్నారు. వానలను లెక్కచేయక ప్రమాదకర పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు జీవో ఎంఎస్ నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, నిత్యం ప్రమాదకర పరిస్థితులలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రిస్కు అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. టీఏ డిఎలు చెల్లించాలని, కాంట్రాక్ట్ వర్కర్స్ రెగ్యులైజేషన్

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

అండ్ యాక్ట్ 1970 ప్రకారం శాశ్వత స్వభావం కలిగి అత్యంత ప్రమాదకర విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో 9 మందికి డ్రైవర్లకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.24,500 వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్ర రెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ భాస్కర్, కోశాధికారి గోపి, మున్సిపల్ నగర అధ్యక్షులు సుంకర రవి, డ్రైవర్ యూనియన్ కార్యదర్శి సుంకర కిరణ్, యూనియన్ నాయకులు, ఆనందు, నాయక్, వెంకటేష్, శివ కొండయ్య, మహేశ్వర్ రెడ్డి, శీను, దస్తగిరిమ్మ, సాయమ్మ, చిన్న, కార్మికులు పాల్గొన్నారు.

భవిష్యత్ నిర్మాణానికి అడుగులు వేయాలి

- జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రభుత్వ విప్ మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు భవిష్యత్తు నిర్మాణానికి అడుగులు వేస్తూ చెడు ఆలోచనలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి సూచించారు. శుక్రవారం నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సాయి సైన్స్ ఫెయిర్(లకోజీ సంజీవరాయ శర్మ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సాన్నిహిత్యం పెరుగుతుందని చెప్పారు. విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు ఒక మార్గదర్శకుడుగా కూడా ఉపయోగపడతాడని సూచించారు. ఎక్స్‌ట్రా కరికులం ఆక్టివిటీస్‌లో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. పదవ తరగతి ఫలితాలలో వైఎస్ఆర్ జిల్లా వెనుకలో ఉందని, ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరచాలని, ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సావిత్రిబాయి పూలే జన్మదిన సందర్భంగా ఆమె గొప్పతనాన్ని వివరించారు. జిల్లా ఇన్‌ఛార్జ విద్యాశాఖ అధికారి, డిఎస్ఒ ఎబనైజర్ మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాల నుంచి వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయ విభాగాలలో ప్రాజెక్టు ప్రదర్శించారని పేర్కొన్నారు. ఇందులో చక్కటి ప్రాజెక్టులను మొదటి రెండు స్థానాల్లో ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి, 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ, ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

అంపైర్‌గా పీడీ కృష్ణయ్య ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆల్ ఇండియా క్యారమ్స్ పోటీలకు అంపైర్‌గా నందలూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పీడీగా పనిచేస్తున్న కృష్ణయ్య ఎంపికయ్యారు. ఈనెల 5 నుంచి 8 వరకు నెల్లూరులో నిర్వహించే ఆల్ ఇండియా క్యారమ్స్ పోటీలకు ఆయన ఎంపైరక్‌గా వ్యవహరిస్తారని ఎపి స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జలీల్, కడప జిల్లా క్యారమ్స్ చైర్మన్ పి.గణేష్ తెలిపారు. మొట్టమొదటిసారిగా ఉమ్మడి కడప జిల్లా నుంచి జాతీయ క్యారమ్స్ ఎంపైర్‌గా ఎంపిక కావడం జిల్లాకు, క్యారమ్స్ సంఘానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ వైద్యులు, కడప సిటిజన్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ ఓబుల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కోటిరెడ్డి మహిళా కళాశాలలో జనవిజ్ఞాన వేదిక సమతా విభాగం, కోటిరెడ్డి కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సంయుక్తంగా సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రతి ఒక్కరు చదువుకోవాలని కోరారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్ల కుమారస్వామి మాట్లాడుతూ ఆధునిక మహిళలు చరిత్రను తిరగరాస్తారని గురజాడ చెప్పిన వాక్యం సత్యం అని చెప్పారు. విద్యార్థులు చిన్న చిన్న సమస్యలకే మనస్థాపం చెంది ఆత్మహత్యలకు గురవుతున్నారని తెలిపారు. విద్య మనిషికి ఆత్మస్థైర్యాన్ని కల్పించాలన్నారు . జనవిజ్ఞాన వేదిక సమత విభాగం కన్వీనర్ సునీత మాట్లాడుతూ మహిళలు తమ సమస్యల కోసమే కాకుండా ఇతరుల సమస్యల పైన స్పందించాలని కోరారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ దీప్తి మాట్లాడుతూ మహిళలు స్వావలంభన సాధించాలని పేర్కొన్నారు. ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ నాగరత్న మాట్లాడుతూ ఎంతోమంది మహిళల స్ఫూర్తిగా తీసుకుని వారి జీవిత చరిత్రలు చదివి మన జీవితాలను మెరుగు చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.శచీ దేవి ని సన్మానించారు. పార్లమెంటులో ప్రసంగించిన కళాశాల విద్యార్థి సయ్యద్ సానియాను, ఎన్ఎస్ఎస్ బెస్ట్ వాలంటీర్ అవార్డు పొందిన వందన ను సన్మానించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు శివరాం, బుద్ధిష్ట్ కల్పిత సొసైటీ నాయకులు మల్లెల భాస్కర్, ఐ క్యు ఏసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సి.వి కృష్ణవేణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఓబుల్‌రెడ్డి

పురుగుల మందును పరిశీలిస్తున్న వ్యవసాయ సంచాలకులు నాగరాజు

రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలి

ప్రజాశక్తి -గోపవరం

రైతులు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా దుకాణదారుల నుంచి తప్పని సరిగా రసీదు తీసుకోవాలని వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీ దాగార్ ఆగ్రో కెమికల్స్, పెస్టిసైడ్ అండ్ సీడ్స్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రకాల రిజిస్టర్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ధరల పట్టిక, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సు గడువు తదితరాలను తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులకు డీలర్, రైతు సంతకాలతో కూడిన రసీదులు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. గడువు ముగిసిన పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మరాదని చెప్పారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మాత్రమే గరిష్ట ధరకు లోబడి విక్రయించాలన్నారు. లేకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పక్షం రోజులకు ఒకసారి స్టాక్ నిల్వల నివేదిక తప్పని సరిగా కార్యాలయంలో సమర్పించాలన్నారు. ధరలు, స్టాక్ నిల్వ లైసెన్సులు విధిగా రైతులకు కనబడేలా ప్రదర్శించాలని చెప్పారు. ట్రేడ్ శాంపిల్స్ కేటగిరి కింద శాంపిల్స్ బద్వేల్ మార్కెట్ యార్డులోని సమగ్ర నాణ్యత పరీక్ష కేంద్రం లో ఎరువులు, విత్తనాల నిర్దేశిత రుసుం చెల్లించి నాణ్యత పరీక్ష చేయించ కోవాలన్నారు.

కాశినాయన : స్వీట్లు తినిపించుకుంటున్న టిడిపి నాయకులు

రితీష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో ఉన్న అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జహంగీర్‌బాషా మాట్లాడుతూ యువ నాయకునిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన రితీష్ కుమార్‌రెడ్డి టిడిపి నియోజకవర్గ సమన్వయకర్తగా ఎదిగారని, రాబోవు రోజుల్లో ఆయన మరింత రాజకీయంగా అభివృద్ధి చెంది ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో కె.వి సుబ్బారెడ్డి, అంబవరం సుబ్బారెడ్డి, రాజుపాలెం నరసింహారెడ్డి, సిరిగిరి పల్లె ముస్తఫా, కంభం శివానందరెడ్డి, షేక్ రఫీ, దర్శి, కేశవ పాల్గొన్నారు. **కాశినాయనలో..** కొనిరెడ్డిరితేష్ రెడ్డి జన్మదిన వేడుకలను జ్యోతి పుణ్యక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. అక్కడ ఆయనకు కాశీనాయన మండల టిడిపి నాయకులు బసిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి అనాథలకు దుప్పట్లు, పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నారెడ్డి కాశినాయన మండల టిడిపి నాయకులు దీన్నెపు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, పోలిరెడ్డి, సర్పంచ్ ఖాజావలి, ఈశ్వర్ రెడ్డి, నర్సిరెడ్డి, నారాయణరెడ్డి, జయరాం రెడ్డి, రమణారెడ్డి, పెద్ద హుస్సేన్ పీరా, శ్రీనివాసులు, మహబూబ్ బాషా, జిలాని, మరియు రితీష్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ట్రిపుల్‌ఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె : రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ఐ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటిలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పవర్ లిఫ్టింగ్ కోచ్ గోవిందు తివారీ చెప్పారు. శుక్రవారం పవర్ లిఫ్టింగ్ లో ప్రతిభ చూపిన విద్యార్థులను డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, ఎఒ రవికుమార్ అభినందించారు. పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటికి చెందిన పియుసి - 2 విద్యార్థి మహబూబ్ తమ ప్రతిభను చాటాడని చెప్పారు. శివ కుమార్, వైష్ణవి అనే విద్యార్థులు కూడా పవర్ లిఫ్టింగ్‌లో రాణించి బంగారు పతకం సాధించారని తెలిపారు. ఒంగోలు క్యాంపస్‌లో పియుసి - 2 కు చెందిన తేజస్విని, చందన కూడా ప్రతిభ చాటి పతకాలను కైవసం చేసుకున్నారన్నారు. పవర్ లిఫ్టింగ్ పోటీలు విజయవాడలోని కృష్ణ లంకలోని జూనియర్ కళాశాలలో జరిగినట్లు చెప్పారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన దీప్తు రమేష్, అనిల్ విద్యార్థులను అభినందించారు.

భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : మండలంలోని ఆర్‌టిపిపిలో 600 మెగావాట్ల విద్యుత్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కమలాపురం కూటమి నాయకులు బాబు, శాంతన్ కోరారు. కడప ఆర్అండ్‌బి అతిథి గృహంలో శుక్రవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు. ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎనిమిది సంవత్సరాలుగా భూములు కోల్పోయి ఉద్యోగాల కోసం తిరుగుతున్నామని అన్నారు. ఎమ్మెల్యే స్పందించి కలెక్టర్ తో చర్చించారు. జెన్ కో ఎమ్‌డితో చర్చలు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని స్థానిక వేముల, ముబ్బుచింతలపల్లె, వెల్లుల, రాచకుంట పల్లె, భూమయ్యగారిపల్లె సబ్ స్టేషన్‌లో 33 KV మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9-00 గంటల నుంచి సాయంత్రం 05-00 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు జెఇ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నివాస గృహాలకు మాత్రమే విద్యుత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయా గ్రామ ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని తెలిపారు.

క్రైం కార్నర్

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్: పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.38450 నగదు స్వాధీనం చేసుకున్నామని పట్టణ ఎస్ఐ నారాయణ తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా పెద్ద జూటూరు దారి దగ్గర జూదం ఆడుతున్న వారిని గమనించి వారిని అరెస్టు చేసి వారి దగ్గర నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - వేముల : స్థానిక కడప- పులివెందుల ప్రధాన రహదారి పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వాహనాలను తన సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. ముందుగా వాహనాలను తనిఖీ చేసి, వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలను, కార్లను ఆపి తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి ఇ చలానా విధించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేస్తాం : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో గత ప్రభుత్వ పాలనలో ఆగిపోయిన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఉన్న ఇబ్బందులను తొలగిస్తామని అందుకే అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పునఃప్రారంభిస్తున్నామని టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలోని సాయి బాబా ఆలయం వద్ద డ్రెయినేజీ, రోడ్డు పనులు చేపట్టేందుకు రోడ్డు భవనాల శాఖ ఇఇమాధవితో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల గత ప్రభుత్వంలో మొదలు పెట్టిన పనులు ఆగిపోయినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు, వ్యాపారులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభిస్తున్నామని చెప్పారు. అధికారంలో 30 ఏళ్ల ఉంటామని అహంకారంతో వేంపల్లెను వైసిపి నాయకులు సర్వనాశనం చేశారని చెప్పారు. కొనేళ్ల నుంచి వేంపల్లి పట్టణ ప్రజలు దుమ్ము ,ధూళి, గుంతల కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు అందరూ తమకు చాలా ఇబ్బందిగా ఉందని, రోడ్డు పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. జగన్‌రెడ్డి ఆనాలోచిత నిర్ణయం వల్ల, అవగాహన లోపం వల్ల ప్రజలు కష్టాలు పడుతున్నారని చెప్పారు. వారి కష్టాలను గుర్తించి నిలిచి పోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. పులివెందులలోని భాకరాపురంలో కూడా రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రోడ్లను పాడు చేయడంతో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. కొన్ని అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన చేపట్టాలని సిఎం దృష్టికి తాము తీసుకెళ్లడంతో స్పందించి పనులు మొదలు పెట్టాలని ఆయన ఆదేశించినట్లు చెప్పారు. పెండింగ్ బిల్లులతో పాటు ప్రస్తుతం జరిగే పనులకు డాకా చెల్లిస్తామని సిఎం చంద్రబాబు భరోసా ఇవ్వడంతోనే పులివెందుల నియోజకవర్గంలోని రోడ్డు పనులు చేపట్టుతున్నట్లు చెప్పారు. రోడ్డు కాంట్రాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి కూడా పెండింగ్ పనులు చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. త్వరలోనే వేంపల్లె బస్టాండును, అలిరెడ్డిపల్లె బ్రిడ్జిని రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేత ప్రారంభించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, తుంగభద్ర హై లెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి, మాజీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జనసేనా నియోజకవర్గ ఇన్ ఛార్జ్ డాక్టర్ హరీష్, రవి తేజా రెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, వేమా కుమార్, శివకృష్ణారెడ్డి, డాక్టర్ కరీముల్లా, గోగుల మల్లికార్జున, వెంకటేష్, రోడ్డు భవనాల శాఖ డిఇ వేణుగోపాల్, ఎఇ మనోహర్ రెడ్డి, కాంట్రాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తో పాటు టిడిపి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి

మోసగించడం భావ్యమా : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం తల్లులను, బడి పిల్లలను, రైతన్నలను మోసగించడం భావ్యం కాదని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికలలో టిడిపి కూటమి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం సూపర్ సిక్స్ హామీలు అన్నారు. అందులో ప్రధానమైంది తల్లికి వందనం పథకమని చెప్పారు. ఈ పథకం కింద స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు అందిస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో 45 లక్షల మంది తల్లులు, 83 లక్షల మంది బడి పిల్లలు ఉన్నారని తెలిపారు. ఏడాదికి రూ 12,450 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు పైసా ఇవ్వలేదని తెలిపారు. ఈ ఎడాది ఇవ్వలేమని వచ్చే ఏడాది నుంచి ఇవ్వాలని ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని అయితే ఈ నిర్ణయం మాట తప్పడమే అవుతుందని అన్నారు. తల్లికి వందనం కాదు – తల్లికి మోసం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. అన్న దాత సుఖీ భవ పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ 20,000 ఆర్థిక సా యం చేస్తామని టిడిపి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని చెప్పారు. అయితే ఇప్పటివరకు పైసా సహాయం చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వాలకం చూస్తుంటే ఈ ఎడాదిలో పథకానికి చేతులు ఎత్తేసినట్లే ఉందని అన్నారు. రాష్ట్రంలో 53.52 లక్షల రైతు కుటుం బాలున్నాయని వారందరూ మోసం పోయారని చెప్పారు. ప్రభుత్వం పునరా లోచించి మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీ భవ పథకాలను ఈ ఆర్థిక సంవత్సరం లోనే అమలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, బాబు, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, మహబూబ్ బాషా, రమణ, నాగరాజు, రవి, వేమా రాజా, మదార్, వేమయ్య, బద్రి, సుబ్బరాయుడు, వినయ్ పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే

సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

భారతదేశ మొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని, గొప్ప సంఘ సంస్కర్త అని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్, సివిక్స్ ఉపాధ్యాయులు జయరాములు అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని గీతం జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఘనంగా నివాళి అర్పిచారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రపంచంలో మహిళా విద్యా ఉద్యమ సిద్ధాంత కర్త, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అన్నారు. విద్యాబుద్ధులు చెప్పడానికి 12 మే 1848న దేశంలో బహుజనులకు మొట్టమొదటి పాఠశాల ప్రారంభించారన్నారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పకుండా కేవలం నాలుగేళ్లల్లోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోహర్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు. **వేంపల్లె :** నిమ్న జాతి వర్గాల అభ్యున్నతి కోసం భర్త జ్యోతి రావూ పూలే అడుగు జాడల్లో నడిచిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలేనని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, అధ్యాపకులు బాల్కొండ గంగాధర్, డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ సతీష్, డాక్టర్ సుధాకర్,డాక్టర్ మల్లేశ్వరమ్మ, రాజారెడ్డి, పీడి తేజేంద్ర, బాలుర పాఠశాల హెచ్ఎం శివ మునెమ్మ, ఉపాధ్యాయులు సంఘమేశ్వరరెడ్డి, ధర్మారెడ్డి, రామచంద్రారెడ్డి, రాజశేఖర్, చంద్రమోహన్ రెడ్డి, రెడ్డి, బాబు, కృష్ణవేణి, లతా, పర్వీన్, వాణి, ఇంతియాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఇఆర్‌టి యశోధకు సత్కారం

ప్రజాశక్తి - వేంపల్లె

విభిన్న ప్రతిభావంతులకు చేస్తున్న సేవలను గుర్తించి ఐఇఆర్‌టి యశోధకు సత్కారం చేశారు. భారత చైతన్య యవజన పార్టీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డుల ప్రదానం చేశారు. వేంపల్లెలోని భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఐఇఆర్‌టి యశోధకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ఈ నేపథ్యంలో విజయవాడలోని బందర్ రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను భారత చైతన్య యవజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, సామాజిక సేవకురాలు రేణు దేశాయి, ప్రముఖ నటుడు బ్రహ్మానందం చేతుల మీదుగా సత్కారం చేశారు. ఐఇఆర్‌టి యశోధకు రాష్ట్ర స్థాయి అవార్డు రావడంతో ఎంఇఒ జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్ లతో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మా రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజవర్గంలో ముస్లిం మైనార్టీల కోసం గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే సింహాద్రిపురంలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి ,వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, సింహాద్రిపురం మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పుప్పాల శ్రీధర్ రెడ్డి, సుదర్శన రెడ్డి, సింహాద్రిపురం మండల మైనార్టీ టీడీపీ నాయకులు, చర్మల రఫీ, నబిరసుల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్కా యాత్ర చేయడం అభినందనీయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముస్లిములు జీవితంలో ఒక్కసారి అయినా పవిత్ర మక్కా యాత్ర చేయడం మంచిదని జమ్మలమడుగు జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జామియా మసీదులో జుమ్మా నమాజు అనంతరం జామియా మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పీఠాధిపతి మక్కా యాత్రకు వెళుతున్న సందర్భంగా ఆయన్ను కాశ్మీరు శాలువాలు, పూల దండలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో జామియా మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

ప్రజాశక్తి- సింహాద్రిపురం

ప్రభుత్వ అధికారులు నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు సంబంధిత కాంట్రాక్టర్‌తో చేయించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కాంపల్లెలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు, శ్మశాన వాటికకు ప్రహరీ, ఇతరత్రా పనులను పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజ వర్గం అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎండియు వాహనం ద్వారా

రేషన్ సరుకులు ఇవ్వాలి : వైసిపి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలో ఎండియు వాహనం ద్వారానే రేషన్ సరుకులు అందజేయాలని వైసిపి నాయకులు, మున్సిపల్ చైర్మన్ ప్రసాద్, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, నూర్‌బాషా సంఘం అధ్యక్షులు రసూల్, జెసిఎస్ ఇన్‌ఛార్జులు పేర్కొన్నారు. శుక్రవారం వారు ఆర్‌డిఒ చిన్నయ్యకు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్లకు స్టాక్ ఇవ్వకుండా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ ప్రజా పంపిణీ వ్యవస్థకు ఆటంకం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ షాపుల వద్ద వృద్ధులు, వికలాంగులు, పనికి పోయేవారు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారన్నారు. రేషన్ షాపుల వద్దకు ఆటో బాడుగలు పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. గతంలో మాదిరిగా ఇంటి ఇంటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మూలి మహేశ్వర్‌రెడ్డి, కో-అప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి సంపత్, ఫకృద్దీన్, గంగరాజు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IInd ADDL.JUNIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
O.S. No:765/2023

Between:

K.Dilip Kumar Reddy ...Plaintiff

And

S.Maruthi Prathap Reddy (Died) by L.Rs
S.Siva Reddy and another ...Defendants

Notice to Defendant No:1 & 2

D1:S.Siva Reddy, S/o. SirigiriByapu Reddy,
D2:S.Teja Reddy @ Tejovathi Reddy W/o Late S.Maruthi Prathap Reddy,
Both are residing at D.No.3-55, Kondreddy Palli Village, Vempalli Mandal, Kadapa-District.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 07-01-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
S.Vishnuvardhan Reddy Advocate
Ananthapuramu. Cell:7396565875.

పాస్‌పోర్టు పోయినది

కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం అమృత నగర్, కొత్తపల్లి గ్రామం, హౌస్ నెం.15/240 నందు నివాసమున్న జి.ఈశ్వరమ్మగారిది. కడప జిల్లా బాకరాపేట ఏరియాలో 30.12.2024వ తేదీన బ్యాగ్ మిస్సయినది. అందులో ఓరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం.M5280018 ఎవరికైన దొరికినచో పై చిరునామకు లేదా సెల్: 96522 68514 తెలుపగలరు.

పాస్‌పోర్టు పోయినది

కడప జిల్లా చెన్నూరు మండలం, చెన్నూరు టౌన్, హౌస్‌నెం.14/179 నివాసంలో వుండే జి.సుశీలమ్మ గారిది కడప జిల్లా బాకరాపేట ఏరియాలో 30.12.2024వ తేదీన బ్యాగ్ మిస్సయినది. అందులో ఓరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం.N5659831 ఎవరికైన దొరికినచో పై చిరునామకు లేదా సెల్: 9701078746 తెలుపగలరు.

పాస్‌పోర్ట్ పోయినది

కడప జిల్లా, సికెదిన్నె మండలం, అశ్వతుగారిపల్లెలో నివాసం ఉంటున్న ఎ.యుగంధర్ గారి భార్య అడవి శ్రీలతకి చెందిన పాస్‌పోర్టు డిసెంబరు 20వ తేదీ సి.కె.దిన్నె నుంచి రాయచోటికి వెళ్ళే బస్సులో వెళుతుండగా ఒరిజినల్ పాస్‌పోర్టు నంబరు **S7652298** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని, 7799476039 మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మమయ్య

మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగైనా వరి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎంపిపి లక్ష్మమయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక మండల సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీలు ఆలస్యం అవుతుండడంతో వ్యవసాయం రైతులు ఇబ్బందులు పడుతున్నారని త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్. ఓబాయపల్లె సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నియామకానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. కెసి కెనాల్‌కు రెండవ కారు సాగు చేసేందుకు నీటిని విడుదల చేయడంపై స్పష్టమైన ప్రకటన జారీ చేయాలని తెలిపారు. అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో నెలకొని ఉన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వీర కిషోర్. డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి శుభకరుణమ్మ ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, ఎఒ రామానుజం, వ్యవసాయ అధికారి మ్యాగీ, సిడిపిఒ సావిత్రమ్మ, ఎంఇఒ రవిశంకర్, ట్రాన్స్ కో ఎఇ రామభద్రయ్య, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

విజయానంద్‌కు రుణపడి ఉంటాం

ప్రజాశక్తి -జమ్మలమడుగు రూరల్

ఎస్. ఉప్పలపాడు గ్రామాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ ఆదర్శ గ్రామంగా నిలిపిన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు రుణపడి ఉంటామని మాజీ టి బి హెచ్ఎల్‌సి చైర్మన్, ఉప్పలపాడు గ్రామ సీనియర్ నాయకులు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా కె.విజయానంద్ ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఉప్పలపాడు గ్రామస్తులు కృతజ్ఞతగా విజయానంద్ చిత్రపటాన్ని గ్రామంలో డప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ 2015లో విజయానంద్ తమ గ్రామాన్ని దత్తత తీసుకొని, గ్రామ పెద్దలు మాయలూరి రామ మనోహర్‌రెడ్డితో కలిసి గ్రామంలో నీరు చెట్టు పథకం, ప్రతి ఇంటికి మరుగుదొడ్ల అభివృద్ధి, సిమెంట్ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, అంగన్వాడీ సెంటర్లు, వైద్య క్లినిక్ తదితర అన్ని రంగాలలో గ్రామాన్ని అభివృద్ధి చేశారన్నారు. 2019 ఫిబ్రవరి 19న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా తమ గ్రామానికి రాష్ట్రంలోనే ఉత్తమ ఆదర్శ గ్రామంగా అవార్డు అందజేశారన్నారు. ఈ ఘనత ప్రభుత్వ సిఎస్ విజయానంద్‌కు దక్కుతుందని చెప్పారు. విజయానంద్ మరెన్నో అత్యున్నత పదవులు అధిరోహించాలని, ఆయు రారోగ్యాలతో జీవించాలని గ్రామ ప్రజలు కోరుతున్నామన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయం, ప్రభుత్వాసుపత్రి, వివిధ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని జెసికి వినతిపత్రం ఇస్తున్న ప్రజా ప్రతినిధులు

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎంపిడిఒ కార్యాలయంలోని శుక్రవారం ఎంపిడిఒ దివిజా సంపతి సంపతి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశం మొక్కుబడిగా సాగింది. ముఖ్య అతిథిగా జెసి అదితి సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల గురించి సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ శాఖల పని తీరుపై సమీక్ష నిర్వహించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, ఎంపిటిసిలు, సర్పంచులు,వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి మౌనం వహిస్తూ సంతాపం వ్యక్తపరిచారు.

నేషనల్ డిఫెన్స్ అకాడమీకి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- ఖాజీపేట : పట్టణానికి చెందిన శ్రీ సాయి కోచింగ్ సెంటర్ పూర్వ విద్యార్థి నాగవర్ధన్ రెడ్డి కలికిరి సైనిక్ స్కూల్ నుంచి నేషనల్ డిఫెన్స్ అకాడమీకి ఎంపికైనట్లు కోచింగ్ సెంటర్ యాజమాన్య ప్రతినిధి పత్తి వెంకట విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వాయి పల్లె కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి నాగచంద్రిక దంపతుల కుమారుడు నాగవర్ధన్ రెడ్డి. తమ కుమారుడు నేషనల్ డిఫెన్స్ అకాడమీకి ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు.

వర్గీకరణపై మరోసారి ఆలోచించాలి

ప్రజాశక్తి - చాపాడు : ఎస్‌సి వర్గీకరణ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వన్‌మెన్ కమిషన్‌ను మాల మహానాడు జిల్లా యూత్ ప్రెసిడెంట్ తీట్ల చిట్టిబాబు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ వద్దు ఐక్యతే కావాలన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని విషయాన్ని వన్ మెన్ కమిషన్‌కు వివరించారు. కార్యక్రమంలో మాల మహానాడు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెంచయ్య మృతికి ఎమ్మెల్సీ నివాళి

ప్రజాశక్తి-అట్లూరు

బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం అట్లూరు అరుంధతివాడలో, అట్లూరు సర్పంచ్ ఎల్లమ్మ మామ చెంచయ్య మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి శుక్రవారం మృతుడి స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక కాయాన్ని పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంటనే వైసిపి మండల కన్వీనర్ ముడుమాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి రామకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, ఫారెస్ట్ మాజీ డైరెక్టర్ మల్లికార్జురెడ్డి, సూరారెడ్డి, కృష్ణారెడ్డి, పెంచల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, లక్ష్మిరెడ్డి, ముత్తుకూరు సర్పంచ్ శ్యామసుందర్, బ్రహ్మానందరెడ్డి పార్టీ నాయకులు ఉన్నారు.

మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి